## క్లుప్తంగా

### అలరించిన 'పాడుతా తీయగా'



చిన్నారి గాయకులతో ఎస్పీఎస్ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు వాసు

ఏలూరు (టూటౌన్): స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఆదివారం పాడుతా తీయగా పిల్లల కార్యక్రమాన్ని నిర్వహించారు. 22 ఏళ్లుగా సంగీత సేవలో ఎందరో శిష్యులను కళాకారులుగా తీర్చిదిద్దిన ఎస్పీఎస్ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు ఎస్పీఎస్ వాసు నిర్వహణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఎస్పీఎస్ దీప్‌చంద్ ప్రార్థన గీతంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. 12 మంది చిన్నారులు పలు గీతాలు ఆలపించి అలరించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నేపథ్య గాయని ఐశ్వర్య న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు, మానవత నాగేశ్వరరావు, ఫాదర్ టి.ఇమ్మానియేలు, సెట్‌వెల్ ప్రభాకర్, అర్జున్‌రావు, పెదపాటి రామకృష్ణ, పలువురు ప్రముఖులు డాక్టర్ ఎస్పీఎస్ వాసు సంగీత సేవను ప్రశంచించి అభినందనలు తెలియజేశారు.

### కొత్తూరులో ఐఫీడ్ పంపిణీ కేంద్రం ప్రారంభం



ఐఫీడ్ పంపిణీ కేంద్రం ప్రారంభ కార్యక్రమంలో ఎంఆర్‌డీ బలరాం తదితరులు

ఏలూరు టౌన్: ఏలూరు రూరల్ మండలం కొత్తూరులో కార్తికేయ ఆక్వా ఫీడ్స్ అండ్ సీడ్స్‌లో దీపక్ నెక్స్‌జెన్ వారి ఐఫీడ్ పంపిణీ కేంద్రాన్ని నెక్కంటి కల్యేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తొలుత ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యఅతిథులుగా టీడీపీ నాయకులు ఎంఆర్‌డీ బలరాం, వాల్విన్ ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కురెళ్ళ రాజేంద్రప్రభు హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. దీపక్ నెక్స్‌జెన్ ప్రతినిధులు, ఆక్వా ప్రముఖ రైతులు, టీడీపీ నేతలు ఉన్నారు.

### పెట్రోల్ బంకులో లక్కీడిప్

దెందులూరు: దసరా సందర్భంగా వాహనదారులను ఆకర్షించేందుకు పలు పెట్రోల్ బంకులు బహుమతులను ప్రకటించాయి. దీనిలో భాగంగా దెందులూరులోని 16నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న కేవీ లక్ష్మీనారాయణ హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో రూ. 200 పైగా పెట్రోల్, డీజిల్ పోయించుకున్న వాహనదారులకు పలు బహుమతులు లక్కీడిప్ ద్వారా అందజేశారు. 12వతేదీన గ్రామస్తులు, వాహనదారుల సమక్షంలో పెట్రోల్ బంక్ అధినేత కె.వి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహించారు.

# యథేచ్ఛగా ఫుట్‌పాత్ ఆక్రమణ

- ఫుట్‌పాత్‌పై పక్కాగా దుకాణాల నిర్మాణం
- చోద్యం చూస్తున్న కార్పొరేషన్ అధికారులు
- నిబంధనలను పట్టించుకోని వైనం
- అధికార పార్టీ అండదండలతో ఆక్రమణలకు పాల్పడుతున్న నాయకులు



ముందుగా ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన టీ స్టాల్, టేబుల్



రాత్రికి రాత్రి ఫుట్‌పాత్‌పై నిర్మించిన ఫుడ్ డెలివరీ షెడ్డు

ఏలూరు (టూటౌన్): నగరంలో యథేచ్ఛగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేసేస్తున్న నగర పాలక సంస్థ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. తమకెందుకులే అనే చందంగా అధికారులు వ్యవహరిస్తుండటంతో పలుకుబడి ఉన్న వారు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్న తమను ఎవరూ ఏమీ చేయలేరులే అనే ధీమాతో కొందరు నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. తమ పలుకుబడి ముందు అధికారులు ఏం చేస్తారులే అనే భరోసా కావచ్చు కొందరు నేతలు నగరంలో విచ్చల విడిగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించేసి వ్యాపారాలు చేసేస్తున్నారు. ఫుట్‌పాత్‌లు అనేవి పాదచారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు రోడ్లు నిర్మించే సమయంలో ఏర్పాటు చేస్తారు. అటువంటి ఫుట్ పాత్‌లు ఏలూరు నగర పరిధిలో పాదచారులకు అక్కరకు రాకుండా పోతున్నాయి. ముందుగా తమకు సంబంధించిన చోటా నాయకులతో కొద్దిగా ఫుట్ పాత్‌లపై చిన్న బడ్డీ కొట్లు, టీస్టాల్స్, తోపుడు బండ్లు వంటివి పెట్టిస్తున్న నాయకులు వారి విషయంలో అధికారులు చర్యలు తీసుకోకపోవడం చూసి పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. దీంతో బడా నాయకులు సైతం ఫుట్ పాత్‌లపైనే కౌంటర్లు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. దీనికి నిదర్శనంగా దసరా సెలవులు రెండు రోజుల్లోనే ఫుట్ పాత్‌పై ఫుడ్ డెలివరీ కౌంటర్‌ను నిర్మించి దర్జాగా ప్రారంభోత్సవం సైతం చేశారు.

**జెడ్పీ సెంటర్‌లో ఆక్రమణల జోరు**

నిత్యం రద్దీగా ఉండే జిల్లా పరిషత్ సెంటర్‌లో జిల్లా అధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇదే క్రమంలో ఆదాయం పెంచుకునే క్రమంలో జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ఈ క్రమంలో ఈ కాంప్లెక్స్‌లో పలు వ్యాపారాలు ప్రారంభించారు. జిల్లా పరిషత్ సెంటర్ నుంచి ఇండోర్ స్టేడియం వైపు వెళ్లే దారిలో టీడీపీకి చెందిన నాయకుడు ఒకరు రెండు షాపులను లీజుకు తీసుకుని వాటిలో ఆహార పదార్థాలకు సంబంధించిన వ్యాపారం చేస్తున్నారు. ఆయనకు పక్కనే మరో చోటా నాయకునితో హోటల్ ఏర్పాటు చేయించారు. దీనిలో భాగంగా టీస్టాల్‌ను ఏకంగా ఫుట్ పాత్‌పైనే ఏర్పాటు చేశారు. దీనిపై విమర్శలు వెల్లువెత్తినా సంబంధిత అధికారులు ఎవ్వరూ పట్టించుకోవడందు. దీంతో రాజకీయ పలుకుబడి కలిగి ఉన్న వారితో మనకెందుకులే అనే ధోరణిలో నగరపాలక సంస్థ అధికారులు వ్యవహరించారనే విమర్శలూ ఉన్నాయి.

**ఆఘమేఘాలపై ఫుట్‌పాత్‌పై ఫుడ్ డెలివరీ కౌంటర్ నిర్మాణం**

టీస్టాల్ విషయంలో అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో దాని పక్కనే టీడీపీకి చెందిన బడా నాయకుడు ఏకంగా ఫుట్‌పాత్‌పై పక్కాగా ఫుడ్ డెలివరీ కౌంటర్‌ను నిర్మించారు. దసరా సెలవులు కావడంతో ఆఘమేఘాలపై దాన్ని నిర్మించి దసరా రోజును ప్రారంభోత్సవం చేశారు. ఆ నిర్మాణాన్ని చూసిన ఆ మార్గం గుండా ఇండోర్ స్టేడియంకు వెళ్లి వచ్చే వాకర్స్, ప్రయాణికులు ముక్కున వేలేసుకుంటున్నారు.

### ప్రజలకు తీవ్ర అసౌకర్యం



ప్రజలకు ఉపయోగపడే ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం ఎంతో బాధాకరంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే జిల్లా పరిషత్ సెంటర్‌లో ఇటువంటి చర్యలకు ఉపక్రమిస్తుంటే నగరపాలక సంస్థ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదు. అక్రమ నిర్మాణాలు ప్రజలకు అసౌకర్యంగా ఉంటున్నాయి.

– డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, ఏలూరు

### అక్రమ నిర్మాణాలను తొలగించాలి



ఫుట్‌పాత్‌లను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలి. నిర్మించిన కట్టడాలను తక్షణం తొలగించాలి. పేదవారు రోడ్డు పక్కగా చిన్న బడ్డీ కొట్టు, తోపుడు బండి పెట్టుకుని జీవనోపాధి పొందుతుంటే ఆఘమేఘాల మీద వచ్చి తొలగించే అధికార యంత్రాంగానికి, ఏకంగా ఫుట్‌పాత్‌నే ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపడితే కనిపించకపోవడం శోచనీయం.

– పెరికె వరప్రసాదరావు, ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ అధ్యక్షుడు, ఏలూరు

### నేడు మినీ బైపాస్‌లో ట్రాఫిక్ మళ్లింపు

ఏలూరు టౌన్: నూతన మద్యం పాలసీలో ప్రైవేటు మద్యం షాపుల ఏర్పాటుకు నేడు లాటరీ తీసేందుకు ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టారని, ఏలూరు మినీ బైపాస్ రోడ్డులో చలసాని గార్డెన్స్‌లో లాటరీ ప్రక్రియ నిర్వహిస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లిస్తున్నట్టు ఏలూరు డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈనెల 14న ఉదయం 6 గంటల నుంచి మద్యం షాపుల టెండర్లు లాటరీ తీస్తారని, వేలాది మంది హాజరవుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా పటిష్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు. ఎక్సైజ్ అధికారులు వాహనాలను చలసాని గార్డెన్స్ బయట, ఉషాబాల ఖాళీ స్థలం, క్రాంతి ఫంక్షన్‌హాల్, గ్రాండ్ కృష్ణ ఫంక్షన్ హాల్ వద్ద పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. లాటరీ ప్రక్రియ వద్ద ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, 16మంది ఎస్సైలు, ఏఎస్సైలు, 88మంది పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బందిని నియమించామని డీఎస్పీ తెలిపారు. ఏలూరు మినీబైపాస్‌లో వాహనాలు వెళ్లేందుకు అనుమతులు లేవన్నారు.

### వైభవంగా శమీ పూజ

ఏలూరు (టూటౌన్): బసవేశ్వర కర్ణభక్తుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహర్నవమి కర్ణోద్భవుల (కర్ణభక్తుల) పుట్టిన రోజు వేడుక సందర్భంగా శమీ పూజ కార్యక్రమం స్థానిక నరసింహారావు పేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులైన వాసా ప్రసాదరావు పూజా కార్యక్రమం విశిష్టతను వివరించారు. సంఘం ఉపాధ్యక్షుడు శివశ్రీ అల్లం సర్వేశ్వరరావు వీరభద్ర స్వామి ఖడ్గంతో దండకం ఉచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెద్దలను సత్కరించారు. తమ్మా గంగాధరరావు, అధ్యక్షుడు పొన్నా కోటేశ్వరరావు, కార్యదర్శి శలా నాగతిరుమలేశ్వరరావు, కోశాధికారి తమ్మా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు వాసా వెంకటరమణ, చల్లా నాగరాజు (నాగు) అందేఏసు, సభ్యులు 60 మంది పాల్గొన్నారు.

## ఒబిలిశెట్టి బాబూరావు సేవలు ఎనలేనివి



ఒబిలిశెట్టి బాబూరావును సత్కరిస్తున్న వాసవి క్లబ్ నాయకులు

ఏలూరు (టూటౌన్): ఉత్తమ ఆదర్శ దంపతులకు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఏలూరు స్థానిక పెరుగు చెట్టు సంగులూరి ఫంక్షన్ హాల్‌లో వాసవి క్లబ్ ద్వారకా తిరుమల గోల్డ్ అతిథ్యంతో ఏర్పాటు చేసిన రీజనల్ కాన్ఫరెన్స్ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వేదా మధు సుదన్ మాట్లాడారు. ఈ సందర్భంగా బాబూరావు సేవాగుణాన్ని కొనియడారు. బాబూరావు విశేష సేవలందించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేతులమీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, హైదరాబాదులో ఇందిరా ప్రియదర్శిని పురస్కారంతోపాటు ఎన్నో అవార్డులు, సత్కారాలు పొందారని తెలిపారు. మానవసేవే మాధవసేవ అనే నినాదంతో బాబూరావు 80 ఏళ్ల వయస్సులోనూ తన సేవలను కొనసాగిస్తూ, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్‌లో అనేక పదవులు చేపట్టి విజయవంతంగా పని చేసి ప్రస్తుతం రీజనల్ చైర్మన్‌గా కొనసాగుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో జూలూరి కాశీ విశ్వనాథం, కొనకళ్ళ జగదీష్, ఉడత లక్ష్మణరావు, ఊటుకూరి కిరణ్ కుమార్, మున్నలూరి లక్ష్మీరాధ సోషల్ వర్కర్ గొంతిన రామకష్ణ, మానవత అజయ్‌బాబు, వి.బాపూజీ, గట్టుపల్లి నాగ వెంకట మాధవి, పబ్బిశెట్టి వినేష్, అప్పన మల్లికార్జునరావు, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

### చర్చి నిర్మాణానికి హర్షవర్ధన్ విరాళం

దెందులూరు: దెందులూరులో నూతనంగా నిర్మిస్తున్న సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్మాణానికి తెలంగాణ హ్యూమన్ రైట్స్ డైరెక్టర్ పల్లె హర్షవర్ధన్ కుటుంబ సభ్యులు రూ. 30 వేలు నగదును ఆదివారం అందజేశారు. కోర్ ఆఫీసర్ మేజర్ రమణయ్య, రిటైర్డ్ టీసీ జోషి, సంఘ సభ్యులు కొంగర కిరణ్‌కు హర్షవర్ధన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా దాతను పలువురు అభినందించారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

ఏలూరు (టూటౌన్): ఇండియా క్రిస్టియన్ మిషన్ చర్చ్ - కృష్ణా గోదావరి డయోసిస్‌కు నిర్వహించిన 5వ సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. సెప్టెంబర్ 1వ తేదీన వెలువడిన ఎన్నికల నోటిఫికేషన్ అనుసరించి గ్రామ, పారిష్ స్థాయి ఎన్నికలు ముగియగా సెప్టెంబర్ 6న సమావేశమైన సెంట్రల్ కమిటీలో ట్రస్ట్ బోర్డు సభ్యులు ఎన్నికయ్యారు. 12న నిర్వహించిన మొదటి ట్రస్ట్ బోర్డు సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నికైంది. బిషప్ జాన్ ఎస్డీ రాజు ఎక్స్ అఫీషియో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. డాక్టర్ ఎస్.జాన్ లియో (ఉపాధ్యక్షుడు,), అడ్వొకేట్ ఎస్.వై.వీ.ప్రసాద్ (డయోసిసన్ కార్యదర్శి), రెవ.డా. టి.ఏసురత్నం (డయోసిసన్ ట్రెజరర్), సభ్యుడిగా రెవ.దేవదాసు యోబు, రెవ. తెనాలి కుటుంబరావు, బ్రదర్ చోరగుడి జాకబ్ రాజు, శ్రీ బెర్కిబిక్ డెస్మండ్, శ్రీ రుద్రాక్షి డేవిడ్, శ్రీ తాడేపల్లి సుబ్బరాజు ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం పదవీ కాలం నాలుగేళ్లు ఉంటుంది. కృష్ణా, గోదావరి జిల్లాల్లోని ఐసీఎం సంఘాలు, పాఠశాలలు వీరి పాలనలో కొనసాగుతాయి.

## వైభవంగా రామాలయం ప్రతిష్ఠ పూజలు



నూతనంగా ప్రతిష్ఠించిన సీతారామలక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలకు పూజలు

భీమడోలు: భీమడోలు పంచాయతీ శివారు దళిత గ్రామం ఆర్జావారిగూడెంలో ఆదివారం శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్ల విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని రామాలయం పునర్నిర్మాణానికి గత ప్రభుత్వం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధులు మంజూరు చేసింది. ఈ తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ ద్వారా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో సర్వాంగ సుందరంగా పునః నిర్మించిన శ్రీరామాలయం ప్రతిష్ఠ కనుల వేడుకగా నిర్వహించారు. పెదవేగి మండలం ముండూరులోని బ్రహ్మచారిణీ విరాజానంద శ్రీ యాజ్ఞవక్క రాజాశ్రమం పూజ్యశ్రీ కృష్ణ చరణానంద భారతీస్వామి బృందం ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆశ్వీయుజ మాస శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీరామచంద్రస్వామికి కలశ స్థాపన, పుణ్యాహవాచనం, గణపతి హోమం, నవగ్రహ పూజలు, శ్రీరామ హోమం, పంచామృత అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శ్రీసీతారామ లక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. రాష్ట్ర సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు విష్ణు, జిల్లా నాయకులు జి.సత్యనారాయణ, సర్పంచ్ పాము సునీత, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, ఎంపీటీసీ ముళ్లగిరి జాన్సన్, బీజేపీ జిల్లా నాయకులు జి ప్రసాదరావు తదితరులు ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాన్ని సుందరంగా నిర్మించిన ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పాము మాన్‌సింగ్‌తోపాటు సభ్యులను ఘనంగా సత్కరించారు.

### పోలీస్ శాఖ సూచనలు పాటించాలి



జాతీయ రహదారిపై భవానీ మాలధారులకు వెనుక వైపు స్టిక్కర్లు వేస్తున్న సీఐ యూజే విల్సన్

భీమడోలు: భవానీ మాలధారులు పోలీస్ శాఖ సూచనలు పాటించి సుఖ ప్రయాణంతో గమ్య స్థానాలకు చేరుకోవాలని భీమడోలు సీఐ యూజే విల్సన్ కోరారు. జిల్లా ఎస్పీ కె.శ్రీప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు సీఐ యూజే విల్సన్ ఆధ్వర్యంలో ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్‌బాబు, సిబ్బంది ఆదివారం సాయంత్రం జాతీయ, రాష్ట్రీయ రహదారులపై భీమడోలు, పూళ్ల, కురెళ్లగూడెం, సాయిబాబా ఆలయం వద్ద కాలినడకన విజయవాడకు వెళ్తున్న భవానీ మాలధారులు, తిరిగి స్వగ్రామాలకు వెళ్తున్న మాలధారులకు పాటించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. పలు కూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. భవానీ భక్తులు నడుచుకుంటూ గమ్య స్థానాలకు చేరుకునే తరుణంలో ఎటువంటి ప్రమాదాలబారిన పడకుండా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టిని సారించిందన్నారు. భవానీ భక్తులు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన నేపథ్యంలో భవానీ మాలధారులు పోలీస్ శాఖ అధికారుల సూచనలను పాటించాలన్నారు. రాత్రి వేళల్లో కాలినడక వెళ్తే భక్తుల వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లను వేసుకోవాలన్నారు. తద్వారా ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందన్నారు. కాలినడకన వెళ్లే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. పోలీస్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 00 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి) | 22.00 | 00 |
| ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం (ఇంద్ర) | 20.15 | 00 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్) | 22.30 | 00 |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు - బీహెచ్ఈఎల్ | 21.45 | 4820 | 00 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ | 21.15 | 4822 | 00 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 00 |
| ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం | 19.45 | 4798 | 00 |
| ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 20.30 | 4800 | 00 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 00 |
| ఏలూరు - ఈసీఐఎల్ | 22.30 | 4814 | 00 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం | 20.30 | 98512 | 00 |
| ఏలూరు - బీహెచ్ఈఎల్ | 22.20 | 98502 | 00 |
| ఏలూరు - తిరుపతి | 16.00 | 4830 | 00 |

## కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

| కూరగాయలు | కిలో ధర | కూరగాయలు | కిలో ధర |
|---|---|---|---|
| టమాటాలు | 48-60 | అరటి కాయ (1) | 07-10 |
| వంకాయలు (గులాబీ) | 54 | చిక్కుడు కాయలు | 60 |
| వంకాయలు (కాంతులు) | 68 | చామదుంపలు | 48 |
| వంకాయలు (తెలుపు) | 54 | ములక్కాడలు | 07,10 |
| బెండకాయలు | 32 | కంద | 60 |
| పచ్చిమిర్చి | 40-44 | బీట్‌రూట్ | 44 |
| కాకర కాయలు | 40-48 | కీరా దోస | 40 |
| బీరకాయలు | 40-50 | ఫ్రెంచ్‌బీన్స్ | 120 |
| బీరకాయలు (పందిరి) | 48 | అల్లం | 70-150 |
| క్యాబేజీ | 32 | కొత్తిమీర (కట్ట) | 20 |
| క్యారెట్ | 40-48 | పాలకూర | 12 |
| దొండకాయలు | 34 | చుక్కకూర | 12 |
| బంగాళదుంపలు | 40 | తోటకూర | 10 |
| ఉల్లిపాయలు | 35-56 | గోంగూర | 07 |
| గోరుచిక్కుడు | 36 | పుదీనా | 05 |
| దోసకాయలు | 36 | బఠాణీ | -- |
| ఆనబకాయ (1) | 30-40 | క్యాప్సికమ్ | 70 |
| పొట్లకాయ(1) | 20-25 | చిలకడదుంప | 48 |

### ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో పయనించాలి

దెందులూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఏసుక్రీస్తు సూచించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని ఏలూరు మేత్రాసన, విశాఖపట్నం అగ్రపీఠం అపోస్తలిక పాలనాధికారి ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి బిషప్ డాక్టర్ పొలిమేర జయరావు అన్నారు. శనివారం దెందు లూరులోని ఆర్‌సీఎం చర్చిలో శుద్ధికరణ మాత మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. దెందులూరు ఆర్‌సీఎం చర్చి విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జి.అమస్ రాజా, విచారణ సహాయక గురువులు రెవరెండ్ ఫాదర్ ఆర్ బాల రాజు, రెవరెండ్ ఫాదర్ డి కళ్యాణ్ ఆధ్వర్యంలో ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అధ్యక్షతన శుద్ధికరణ మాత మహోత్సవాలు నిర్వహించారు. ఏలూరు అగ్ర పీఠాధిపతి పొలిమేర జయరావు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సర్పంచ్ తోట ఏసమ్మ యేసు దంపతులు, గ్రామస్తులు, సంఘస్తులు బిషప్ పొలిమేర జయరావును ఘనంగా సన్మానించారు.

### అమ్మవార్ల ఆలయానికి రిఫ్రిజిరేటర్ వితరణ

దెందులూరు: గాలాయగూడెం గ్రామ దేవత అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయానికి గాలాయగూడెంకు చెందిన వ్యాపారవేత్త పూజారి సర్వేశ్వరరావు, కుమారుడు పూజారి సీతారామ్ రిఫ్రిజిరేటర్ అందజేశారు. కమిటీ సభ్యులు పూజారి శ్రీనివాసరావు. పూజారి వెంకటరత్నం నాయుడు, ఏనుగు రామకృష్ణ, గంటా సుబ్బారావు, పెద్ది శెట్టి నాని, యుగంధర్ తదితర అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులకు దాత రిఫ్రిజిరేటర్‌ను అందజేశారు. గాలాయగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయానికి రిఫ్రిజిరేటర్‌ను సర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి దాత పూజారి సీతారాం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు దాతను అభినందించారు.

### కార్యకర్తలకు అండగా ఉంటాం

దెందులూరు: గాలాయగూడెంలో ఎస్సీ ఏరియాకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దర్శనపు నాగరాజు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబానికి పార్టీ తరఫున యువ నాయకులు సాయం అందించారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం ఆదేశాల మేరకు నాగరాజు కుటుంబానికి నిత్యావసర సరుకులు అందించారు. పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని వారన్నారు.

## భక్తి శ్రద్ధలతో గొంతానమ్మ ఉత్సవం



పోలసానిపల్లిలో నందీశ్వరుడిని ఊరేగిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

భీమడోలు: పోలసానిపల్లి హరిజనపేటలోని విజయదశమిని పురస్కరించుకుని శనివారం గొంతానమ్మ ఉత్సవాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవత గొంతానమ్మవారికి నవరాత్రుల పూజలను ఏటా వైభవంగా నిర్వహిస్తున్నారు. విజయదశమి రోజున గ్రామస్తులు పెద్ద ఎత్తున నందీశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలను సమర్పించారు. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అంబటి దేవి ప్రసాద్ దంపతులు నందీశ్వరునికి పూజలు చేశారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని వారంతా పూజలు చేశారు. అమ్మవారికి అభిషేక, పూజలు చేశారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో యువకులు, గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున నందీశ్వరుడిని వ్యాన్‌పై ఉంచి గ్రామంలో ఊరేగించి అనంతరం కాలువలో నిమజ్జనం చేశారు.

### గోపన్నపాలెంలో సాయిబాబా బ్రహ్మోత్సవం

దెందులూరు: సానిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని సాయి వృద్ధాశ్రమం సాయిబాబా ఆలయం పరిధిలో గోపన్నపాలెం, గాలాయగూడెంలో సాయిబాబా ఊరేగింపు, బ్రహ్మోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సాయిబాబా భక్తులు స్వామివారి దర్శించుకుని ఊరేగింపులో పాల్గొన్నారు.

### కనకదుర్గమ్మకు పూజలు

దెందులూరు: మేధనరావుపాలెంలో దసరా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. కనకదుర్గమ్మ తల్లి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు కమిటీ సభ్యులు భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

### అమ్మవారికి వెండి వీణ సమర్పణ

పెదపాడు: అమ్మవారికి వెండి వీణను వట్లూరుకు చెందిన గొర్రెల లక్ష్మణరావు బేబీ అనురాధ దంపతులు సమర్పించారు. వట్లూ రు నెహ్రూ నగర్ కాలనీలోని దుర్గా మల్లేశ్వరస్వామికి రూ.1,16,500 విలువైన వెండి వీణ ను అమ్మవారికి సమర్పించారు. దుర్గామల్లేశ్వరస్వామిపై ఉన్న విశ్వాసంతోనే వెండి వీణ అందించామని లక్ష్మణరావు దంపతులు తెలిపారు.

### అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు



ఎస్సై ఆర్.శివాజీ

దెందులూరు: దెందులూరు మండలంలో పేకాట, కోడిపందేలు, ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే వారిపై ఉక్కు పాదం మోపుతామని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్.శివాజీ అన్నారు. ఆదివారం దెందు లూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ పాత నేరస్తులు అనుమానితులు, కోడి పందేలు, పేకాట నిర్వాహకులపై ఇప్పటికే నిఘా ఉందన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై 9440796654 నంబర్‌కు సమాచారాన్ని అందించాలన్నారు. సమాచారం ఇచ్చినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని దెందులూరు మండలం పూర్తిస్థాయిలో శాంతిభద్రతల అమలుకు తమ వంతు బాధ్యత మండల ప్రజలందరూ అందించాలని ఎస్సై ఆర్‌శివాజీ కోరారు.